క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్‌: కరీంనగర్‌ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ అంబేద్కర్‌ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌ పాఠశాల విద్యార్థులు అశ్విత, కట్టుకూరి త్రినాథ్‌, సాయిప్రణయ్‌, వినయ్‌, వినోద్‌, బిందూశ, క్రిష్‌కుమార్‌సింగ్‌ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు సోమవారం వారిని అభినందించారు. ఎక్స్‌సర్వీస్‌మెన్‌ జిల్లా అధ్యక్షుడు శివ, కరాటే మాస్టర్‌ దేవయ్య, రవిరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూజలు

కాగజ్‌నగర్‌రూరల్‌: వినాయక నిమజ్జనం సందర్భంగా లారీ చౌరస్తా (శివాజీచౌక్‌)లో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులకు మంగళవారం పూజలు చేయనున్నట్లు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సిందం శ్రీనివాస్‌ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్‌ హరీశ్‌బాబు హాజరవుతారని పేర్కొన్నారు. ఆర్కెస్ట్రా ద్వారా భక్తి గీతాలాపన ఉంటుందని, పండ్ల రసం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

డీఎస్పీని కలిసిన విశ్రాంత ఉద్యోగులు



డీఎస్పీని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కాగజ్‌నగర్‌రూరల్‌: డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రామానుజంను సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్‌, నరసయ్య, అన్వర్‌ అహ్మద్‌, నర్సయ్య, జిల్లా బాధ్యులు ఎం.సుభాష్‌, పురుషోత్తం, రామయ్య, సునీల్‌ కుమార్‌, పురుషోత్తం, రామయ్య ఉన్నారు.

శిశువుకు అంత్యక్రియలు



శిశువును అంత్యక్రియల కోసం తీసుకెళ్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: బెస్ట్‌ ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఓ శిశువుకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చింది. కుమురంభీం జిల్లా లింగాపూర్‌ మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మడావి సక్కుబాయి–గోవింద్‌లకు నాలుగు రోజుల క్రితం మగ శిశువు జన్మించాడు. సోమవారం ఆ శిశువు మరణించడంతో అంత్యక్రియల కోసం బంధువులు, స్నేహితులకు సంప్రదించినా ఎవరు ముందుకు రాలేదు. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ అధ్యక్షుడు అజీజ్‌ మానవత దృక్పథంతో ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

కరెన్సీ దండల చోరీ

ఆసిఫాబాద్‌: జిల్లాకేంద్రంలోని గణేశ్‌ మండపాల వద్ద ఏర్పాటు చేసిన కరెన్సీ దండలు చోరీకి గురయ్యాయి. ఆదివారం రాత్రి వాసవీ మందిరంలోని గణేశ్‌ మండలి వద్ద రూ. 2100 విలువ చేసే కరెన్సీ దండ, సాయినివాడలోని గణేశ్‌ మండపం వద్ద రూ.1000 విలువ చేసే కరెన్సీ దండలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం గుండి రహదారిలోని హోలీ ట్రినిటీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ్‌ మండపం వద్ద కరెన్సీ దండను చోరీ చేశారు.

నిమజ్జన ప్రాంతాలు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గల గణేశ్‌ నిమజ్జన ప్రాంతాలను సోమవారం కాగజ్‌నగర్‌ డీఎస్పీ రామానుజం పరిశీలించారు. రూరల్‌ సీఐ శ్రీనివాస్‌రావు, ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్‌, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు జాతీయ జెండా ఆవిష్కరణ

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోట ప్రసాద్‌ తెలిపారు. తహసీల్దార్‌ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు హాజరుకావాలని కోరారు.

సేవ పక్వాడ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు చేపట్టే సేవ పక్వాడ కార్యక్రమాలు విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్‌ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను ఇన్‌చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు.

వినాయకా.. సెలవిక

- ఘనంగా గణేశ్‌ నిమజ్జనం
- ఆకట్టుకున్న మహిళల నృత్యాలు
- బ్యాండ్‌ మేళాతో శోభాయాత్ర
- పెద్దవాగులో నిమజ్జనం



కౌటాలలో గణేశ్‌ నిమజ్జన శోభాయాత్రలో భక్తులు



నిమజ్జనంలో పాల్గొన్న వాసవీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



సిర్పూర్‌(టి) పూజలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు



దహెగాం: నృత్యం చేస్తున్న యువకులు



గుడ్లబోరిలో గణేశ్‌ నిమజ్జనంలో మహిళలు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో గణేశ్‌ నిమజ్జనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులు పూజలందుకున్న గణనాథుల విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై శోభాయమానంగా అలంకరించి, పురవీధుల గుండా పెద్దవాగు వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. ఉదయం పూజలు అనంతరం వాయిద్యాలు, బ్యాండ్‌ మేళాతో శోభాయాత్ర నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గణేశ్‌ మందిర్‌, శారదా గణేశ్‌ మండలి, శిశుమందిర్‌, వాసవీ స్కూల్‌లో నెలకొల్పిన గణనాథులను పెద్దవాగులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా మహిళలు, యువతుల కోలాటం, డాండియా నృత్యాలు ఆకట్టుకున్నాయి. గణపతి బొప్పా మోరియా నినాదాలు చేస్తూ శోభాయాత్ర కొనసాగించారు. గణేశ్‌ మందిర్‌ వద్ద కరెన్సీ దండ వేలాన్ని రూ.5,500కు సతీశ్‌ దక్కించుకున్నాడు. శిశుమందిర్‌లో సుంకం సురేశ్‌ రూ.5150 వేలం పాడి గణేశ్‌ లడ్డూ దక్కించుకున్నారు. శారదా గణేశ్‌ మండలి వద్ద నవరాత్రి వేడుకల నిర్వహణకు ఆర్థికసాయం అందించిన పోతులూరి రాంప్రసాద్‌ గౌడ్‌ దంపతులకు లడ్డూ అందజేసి సన్మానించారు. సీఐ సతీశ్‌ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెద్దవాగు వద్ద లైటింగ్‌తోపాటు నిమజ్జనం కోసం క్రేన్‌తోపాటు గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. మున్సిపల్‌ కమిషనర్‌ భుజంగరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనం కొనసాగింది. నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో గణనాథుడి నిమజ్జనం

దహెగాం: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో గణేశ్‌ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు వీధుల గుండా శోభాయాత్రలో యువకులు నృత్యం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కౌటాల: మండలంలోని గణేశ్‌ విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణేశ్‌ మండపాల వద్ద లడ్డూను వేలం పాట నిర్వహించారు. శీర్షాలో లడ్డూను రూ. 36 వేలకు వేలం పాడి నీల భీరేశ్‌ దక్కించుకున్నారు. సమీప చెరువులు, వాగుల్లో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

గణనాథునికి పూజలు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ఆదర్శనగర్‌లోని శివాలయంలో గణేశ్‌ మండపం వద్ద ఎమ్మెల్యే హరీశ్‌బాబు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా గువ్వలగూడలో గణనాథునికి పూజలు చేశారు. నాయకులు సిందం శ్రీనివాస్‌, విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్‌, మహేశ్‌, శివ, నాని, నాగేందర్‌సింగ్‌, మునిందర్‌సింగ్‌, ప్రదీప్‌ మండల్‌, ప్రసాద్‌, తిరుపతి, సుధాకర్‌, సుమన్‌, నరసింహ పాల్గొన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీ ఎల్‌బీఎస్‌ మార్కెట్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప–రమాదేవి దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.

సిర్పూర్‌(టి): గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సిర్పూర్‌(టి) మేజర్‌ పంచాయతీ పరిధిలోని డౌనల్‌ ప్రాంతంలో గణనాథుడికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పూజలు నిర్వహించి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంతో పాటు గోలేటి, నంబాల తదితర గ్రామాల్లో గణేశ్‌ నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. డీజే పాటలు, బ్యాండ్‌ మేళాల నడుమ శోభాయాత్ర కనులపండుగా నిర్వహించగా యువకులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేశారు. సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గంగాపూర్‌, గొందుగూడ వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



జిల్లాకేంద్రంలో..



గణేశ్‌ మందిర్‌ గణనాథుడి శోభాయాత్ర



పెద్దవాగు వద్ద నిమజ్జనం చేస్తున్న శిశుమందిర్‌ గణనాథుడు



దహెగాంలో..



రెబ్బెన: నృత్యం చేస్తున్న మహిళలు



రెబ్బెనలో పాల్గొన్న యువకులు



శిశుమందిర్‌ విద్యార్థుల శోభాయాత్ర

ఏరియాలో డైరెక్టర్‌ పర్యటన



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్‌ వెంకటేశ్వరరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియాలో సోమవారం సింగరేణి డైరెక్టర్‌ (ప్లానింగ్‌ అండ్‌ ప్రాజెక్టు) జి. వెంకటేశ్వరరెడ్డి పర్యటించారు. జీఎం శ్రీనివాస్‌తో కలిసి కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఓసీపీకి సంబంధించిన ఉత్పత్తి వివరాలు, వార్షిక ఉత్పత్తి లక్ష్యం వివరాలను తెలుసుకున్నారు. క్వారీ లోపలికి వెళ్లి పని స్థలాలు, బొగ్గు బెంచ్‌ల వద్ద నీటి నిల్వలతోపాటు వట్టివాగు, కాపర్‌ డ్యాంను పరిశీలించారు. ఉల్లిపిట్ట, దోర్లి గ్రామాలకు వెళ్లే దారిలో నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. వెస్ట్‌ వ్యూ పాయింట్‌ నుంచి కైరిగూడ ఓసీపీ పని స్థలాలను పరిశీలించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ప్రాజెక్టు అధికారులు నరేందర్‌, ఉమాకాంత్‌, ఏరియా ఇంజినీర్‌ భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజినీర్‌ వీరన్న తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దహెగాం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు పుప్పాల శ్రీనివాస్‌ తండ్రి రాజయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండె విఠల్‌ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్‌ సిడాం గణపతి, నాయకులు హర్షద్‌ హుస్సేన్‌, చిలువేరు కమలాకర్‌ తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్‌

అర్హులను విధుల్లోకి తీసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్‌: మైనార్టీ రెసిడెన్షియల్‌ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్‌ స్టాఫ్‌ నియామకాలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో చర్యలు చేపట్టి అర్హులైన వారిని విధుల్లోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తొటం శ్యాంసుందర్‌ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. మైనార్టీ రెసిడెన్షియల్‌ పాఠశాలల్లో గతంలో పనిచేసిన ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీయూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షులు శాంతికుమార్‌, సహ అధ్యక్షుడు డి.భానుప్రకాశ్‌ పేర్కొన్నారు. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషన్‌ సొసైటీ ఇచ్చిన మెమో ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

జైనూర్‌(ఆసిఫాబాద్‌): మండల కేంద్రంలోని కాలేజ్‌గూడ చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు మూడు కిలోల గంజాయి పట్టుకున్నారు. ఎస్సై సాగర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జివితి తాలుకా షేన్‌గావ్‌ గ్రామానికి చెందిన మిథున్‌, దేవురావు, లియాఖత్‌ మాలేగావ్‌కు కెరమెరి మండలం మీదుగా మూడు కిలోల గంజాయితో కారులో బయలుదేరారు. కాలేజ్‌గూడ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మెరుగైన విద్యనందించాలి

నార్నూర్‌(గాదిగూడ): గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్‌ విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్‌ సంతోష్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం కేజీబీవీని సందర్శించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సంతోష్‌

కష్టాలు తీరేదెప్పుడో?



అధ్వానంగా బుగ్గ రామన్న గూడెంకు వెళ్లేదారి

- బుగ్గ రామన్నగూడెంలో సౌకర్యాలు కరువు
- బండరాళ్లే రహదారి..
- కాలినడకన వెళ్లాలంటే ఇబ్బంది
- అవస్థలు పడుతున్న గిరిజనులు

తిర్యాణి: స్వాతంత్రం వచ్చి ఏళ్లుగా గడుస్తున్నా గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గూడాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో గిరి ప్రజలు తిప్పలు పడుతున్నారు. గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి పాటుపడుతున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఫలాలు కనిపించడం లేదు. మండలంలోని మాణిక్యపూర్‌ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న బుగ్గ రామన్న గూడెంలో గిరిజనులు కనీస వసతులు లేక కష్టాలు పడుతున్నారు.

కాలమేదైనా కాలినడకన..

మండల కేంద్రం నుంచి దాదాపు 15 కి.మీ దూరంలో ఉన్న బుగ్గ రామన్న గూడెంలో ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో 14 ఆదివాసీ కుటుంబాలు ఉండగా, 40 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏ కాలంలోనైనా వారికి కాలినడకనే దిక్కవుతోంది. ప్రతి చిన్న అవసరానికి 3.5 కి.మీ దూరాన ఉన్న మాణిక్యపూర్‌ వెళ్లాల్సిందే. నడిచే దారి బండరాళ్లే ఉండడం, మధ్యలో వాగు వల్ల వర్షాకాలంలో రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. రేషన్‌ బియ్యం, పింఛన్‌, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం అవస్థలు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో రోగులకు ఆస్పత్రులకు తీసుకెళ్లందుకు సదుపాయం లేక పడరాని పాట్లు పడుతున్నారు. గూడెంలో సదుపాయలు కల్పించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని లేదని గిరి ప్రజలు వాపోతున్నారు.

కష్టమవుతుంది



ప్రతీనెల రేషన్‌ బియ్యం నెత్తిపై మోసుకుని వచ్చుడు మస్తు కష్టమవుతుంది. కనీసం నడిచే దారి సక్రమంగా లేదు. పెద్ద బండరాళ్లపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాం. వానకాలంలో వాగు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా బంద్‌ అవుతున్నాయి.

– భీంబాయి, బుగ్గరామన్న గూడెం

సౌక్యరాలు కల్పించాలి



మా ఊరిలో కనీస సౌక్యరాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. అనార్యోగంతో బాధపడుతున్న రోగులను కాలినడకన ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అష్టకష్టాలు పడుతున్నాం.

– గంగుబాయి, బుగ్గరామన్న గూడెం

కాంట్రాక్ట్‌ కార్మికుడికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్‌: సిర్పూర్‌ పేపర్‌ మిల్లు (ఎస్పీఎం)లో సోమవారం సాయంత్రం ఫైబర్‌ లైన్‌ డిపార్టుమెంట్‌లో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడికి గాయాలయ్యాయి. తోట నరేశ్‌ విధులు నిర్వహిస్తుండగా, ఎయిర్‌ పైపు లీక్‌ కావడంతో ప్రమాదం జరిగినట్లు కార్మికులు తెలిపారు. ఎడమ చేయికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పశువులు పట్టివేత

సిర్పూర్‌(టి): మహారాష్ట్ర నుంచి సిర్పూర్‌(టి) మండలం మీదుగా నిజామాబాద్‌ పట్టణానికి అక్రమంగా పశువులు తరలిస్తున్న నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. సిర్పూర్‌(టి) ఎస్సై కమలాకర్‌ కథనం ప్రకారం.. సోమవారం వేకువజామున నాలుగు వ్యాన్లలో 64 పశువులు(ఎద్దులు) ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తుండగా సిర్పూర్‌(టి)లో పట్టుకున్నారు. ముందు స్థానిక పోలీసుస్టేషన్‌కు పశువులను తరలించి, అక్కడి నుంచి కాగజ్‌నగర్‌ పట్టణంలోని గోశాలకు తరలించారు. వాహనాల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, పశువుల యజమానులు సలీం ఖురేషీ, షేక్‌ తౌసిఫ్‌, షేక్‌ సోహెల్‌, షేక్‌ తౌహీద్‌, మోసిన్‌ ఖాన్‌, షేక్‌ నదీమ్‌, సచిన్‌, రాంటెంకి శైలేష్‌, షేక్‌ హనీస్‌, రమేశ్‌కుమార్‌, ఎండీ యూనిస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్సై తెలిపారు.



పట్టుకున్న పశువులు

లడ్డూ దక్కించుకున్న ముస్లిం దంపతులు



కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని భట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీవిఘ్నేశ్వర గణేశ్‌ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డూకు సోమవారం వేలం వేశారు. ఈ వేలంలో రూ.13,216 వేలం పాడి లడ్డూను అదే కాలనీకి చెందిన అఫ్జల్‌ ముస్కాన్‌ దంపతులు కైవసం చేసుకున్నారు.

లడ్డూతో ముస్లిం దంపతులు